# సోమి సోమయాజులు

అగ్నిహోత్రం, యజ్ఞాల నిర్వహణలో భార్య తప్పనిసరిగా ప్రక్కన ఉండాలని నియమముండుటవలన సోమయాజులు గార్లు తమ భార్య చనిపోయినప్పడు వారికి ఎంతవయస్సు ఉన్నప్పటికి నియమం ప్రకారం అగ్నిహోత్రయజ్ఞ నిర్వహణకై వయసులో ఉన్న ఆడపిల్లను పెళ్లిచేసుకొనేవారు. అందువలన సోమయాజులుగారికి ౮౦ ఏళ్ళు ఆయన పెళ్లిచేసుకొనే ఆమెకు (సోమి) ౧౬ ఏళ్లు ఉండేసంఘటనలు పూర్వకాలంలో ఉండేవి. అగ్నిహోత్రం, యజ్ఞం, కొరకేకాక వృద్ధాప్యంలో తనకు తోడుగా ఉండునని ఆశతోకూడా వారు పునర్వివాహం చేసుకొనేవారు. వీరికి పిల్లనిచ్చుటకు పేదకుటుంబంలోని తల్లి, తండ్రులు ముందుకువచ్చేవారు. వారికి కన్యాశుల్కం ఇచ్చి సోమయాజులు గారు వారి అమ్మాయిని వివాహమాడేవారు. ఈ వివాహంవల్ల కన్యాశుల్కం అనే దురాచారం పెరుగుట, ఆ దురాచారాన్ని అపుటకై శ్రీ గురజాడ అప్పారావు గారు కన్యాశుల్కం అను నాటకాన్ని వ్రాశారు. ఆ నాటకం అప్పటికీ ఇప్పటికీ బహుళప్రజాదరణ పొందింది. ఆ కాలంలో కన్యాశుల్కమను దురాచారం అరికట్టుటకు ఉపయోగపడింది.

అలాగే ఈ పగటి వేషంలో కూడా ఒక ౮౦ సంవత్సరాలు పైబడిన సోమయాజులు గారు ౧౬ సంవత్సరాల వయసు బాలికను మూడవ పెండ్లి చేసుకుంటారు. ఆ వృద్ధ సోమయాజులుగారు యుక్తవయస్సులో ఉన్న భార్యతో పడేపాట్లను హాస్యరూపంలో చూపించడం జరుగుతుంది. ఈ సోమయాజులుగారికి శిష్యులు కూడా ఉంటారు. ఆ శిష్యులు కూడా సున్నితమైన హాస్యాన్ని అందిస్తారు. తన భార్యపై ఉన్న అసహ్యాన్ని సోమిదేవి ఈ విధముగా సంభాషణలో ప్రదర్శిస్తుంది.

సోమిదేవి : సోమి । సోమి । అనే నోటికి విధివిరామం కూడా లేదుకదా । ఆ దవడలు ఎన్నడైనా పచ్చివెలక్కాయచిప్పవలె దగ్గిరగా నొక్కకుపోతే సుఖపడచ్చును.

సోమయాజులు : వషే సోమీ। భర్త అనగా సాక్షత్తు భగవంతునితో సమతుల్యం కదా। నన్నేమయినా అంట నీకు చాలా పాపం తగులుతుంది.

సోమిదేవి : ఏవండోయ్ నావల్ల పాపముంటే నా పసుపు కుంకుమ పోతుంది లేకపోతే మీవల్ల పాపముంటే మీరేమట్టికట్టు కొనిబోడ్డాకులపాలై మీరేపోతారండోయ్... అంటుంది.

ఈ విధంగా వృద్ధవయస్సులో పెళ్లిచేసుకుంటే వచ్చే యిబ్బందులను హాస్య సంభాషణలతో చెప్పించడం జరుగుతోంది.

అలాగే శిష్యులు కూడా తమ హాస్య సంభాషణలతో రక్తి కట్టిస్తారు.

గురువు : ఒరే నాయనా మన సోమిదేవి ఏదిరా ।

శిష్యుడు : అయ్యా గురువుగారు సోమిదేవి అమ్మగారు తమ వామభాగానవుందండి.

గురువు : ఛీ దౌర్భాగ్యుడా । నీకు సోమె నాకు సోమేనట్రా తప్ప కదూ ....

ఈ విధంగా ఈ కళారూపంలోని అందరు పాత్రధారులు తమ హాస్య సంభాషణలతో ప్రేక్షకులను నవ్వించుటే గాక సామజిక రుగ్మతలను వేలెత్తి చూపుతారు